సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

చెట్లు .. ప్రగతికి మెట్లు



మొక్కలు నాటుతున్న సాయిగణేష్‌యాదవ్

మల్కాపురం: ప్రతి ఇంటా చెట్టు ప్రగతికి మెట్టు అని హెచ్‌పీసీఎల్ మెటీరియల్ సెక్షన్ సీనియర్ ఆఫీసర్ సాయిగణేష్‌యాదవ్ అన్నారు. ఎల్ ఎన్‌జీ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం సంస్థ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటి వద్ద కనీసం ఒక్క మొక్క అయినా నాటాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల జన్మదిన వేడుకల సమయాల్లో విశాలమైన ప్రదేశాల్లో కనీసం పది మొక్కలైనా నాటితే అవి పెరిగి మనిషి మనగడకు అండగా నిలుస్తాయన్నారు.

వ్యర్థాలమయం



గోపాలపట్నం ప్రధాన రహదారిలోని గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు ప్రధాన రహదారిలో సురేష్ స్టూడియో వద్ద గెడ్డలో వ్యర్థాలు పేరుకు పోయాయి. దీంతో మురుగు వెళ్లక దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. ఎప్పటికప్పుడు ఈ గెడ్డ వ్యర్థాలతో నిండిపోతోందని స్థానికులు చెబుతున్నారు. ఎగువ ప్రాంతంలో ఉన్నవారు కాల్వల్లో వ్యర్థాలు వేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. తొలుత ఈ వ్యర్థాలు తొలగించి..కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా ఉండే విధంగా చేయాలని కోరుతున్నారు.

గోల్డ్ మెడల్ ఏర్పాటుకు విరాళం



చెక్కు అందజేస్తున్న దాతలు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం నావెల్ ఆర్కిటెక్చర్ విభాగంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు టెక్నాలజీ అసోసియేట్స్ (టీఏఐ) ఇంజినీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 10.50 లక్షల భారీ విరాళాన్ని అందించింది. ఈ విరాళంలో భాగంగా, రాజ్–టీఏఐ గోల్డ్ మెడల్ ఏర్పాటు చేయడానికి రూ. 3 లక్షలు, అలాగే శిరి అండ్ అనిల్ రాజ్ ఎండోమెంట్ స్కాలర్‌షిప్ ఏర్పాటు చేయడానికి రూ.7.50 లక్షలు అందజేశారు. విరాళానికి సంబంధించిన చెక్కును టీఏఐ ఇంజినీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జానకి రామన్ గణేశన్ మంగళవారం ఏయూ ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావుకు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ విధంగా సహకరిస్తున్న దాతలు అభినందనీయులని వీసీ, రిజిస్ట్రార్ అన్నారు. ఈ విరాళం నావెల్ ఆర్కిటెక్చర్ విభాగం విద్యార్థుల ఉన్నత విద్యకు, వారి భవిష్యత్తుకు ఎంతగానో తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధి కార్యాలయం, మోడల్ కెరీర్ సెంటర్‌లు యువతకు ఉచితంగా సాఫ్ట్‌వేర్ శిక్షణను అందిస్తున్నాయి. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల ఇంటర్, డిగ్రీ, డిప్లమో పూర్తి చేసిన యువతీ యువకులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డెవలపర్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు కంచరపాలెం నందు గల ఉపాధి కార్యాలయంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం పి. నరసింహారావు (79015 23209), ఎం. నాగ త్రినాథ్ (98855 07887) నంబర్లలో సంప్రదించవచ్చు.



‘రేషన్ బియ్యం కోసం శాంతినగర్ నుంచి కిలోమీటరున్నర దూరం నడిచి వచ్చాను. మిషన్ పనిచేయడం లేదని మళ్లీ రమ్మంటున్నారు. సోమవారం సాయంత్రం వచ్చినప్పుడు కూడా ఇదే మాట చెప్పారు. మోకాళ్ల నొప్పులు ఉన్నా బియ్యం కోసం కాళ్లీడ్చుకుంటూ వచ్చాను. ఇలా ఎన్నిసార్లు తిప్పించుకుంటారు నాయనా. మిషన్ ఎప్పుడు పనిచేస్తే అప్పుడే బియ్యం తీసుకుంటాను.. అందాక, ఇక్కడే ఉంటాను.’

దుకాణానికి ఎదురుగా ఉన్న చెట్టుకింద కూర్చొన్న సత్తా దేవుడమ్మ మాటలివి. 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్ రేషన్ డిపో వద్ద మంగళవారం కనిపించిన దృశ్యమిది. ప్రజానీకానికి రేషన్ కష్టాలు ఏ రీతిన ఎదురుకానున్నాయనే దానికి ఇదే నిలువెత్తు నిదర్శనం.



బుచ్చిరాజుపాలెం డిపో వద్ద ఎండలో నిరీక్షిస్తున్న కార్డుదారులు

రేషన్ తిప్పలు..!

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తోంది. వివిధ పథకాల కోతల్లో భాగంగా తాజాగా ఇంటి వద్దకే నిత్యావసర సరకుల పంపిణీని రద్దు చేసింది. రేషన్ దుకాణాల్లో సర్వర్ మొరాయించడంతో కార్డుదారులు అవస్థలు పడుతున్నారు. వేలిముద్రలు పడక నిరీక్షించాల్సి వస్తోంది.

- దుకాణాల వద్ద పడిగాపులు
- మండుటెండలో కార్డుదారుల ఇబ్బందులు
- సర్వర్ మొరాయించడంతో చేతులెత్తేస్తున్న డీలర్లు
- చోద్యం చూస్తున్న సివిల్ సప్లై అధికారులు



లక్ష్మీనగర్‌లో బియ్యం మోసుకువస్తూ..

విశాఖ విద్య: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి తలుపుతట్టి రేషన్ బియ్యం పంపిణీ చేసిన ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం తొలగించింది. రేషన్ దుకాణాల వద్దకే వచ్చి సరకులు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ఈ నెల 1 నుంచి పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని రేషన్ డిపోల వద్ద బియ్యం, ఇతర సరకుల పంపిణీ కొనసాగుతుంది. అయితే డిపోల వద్ద రేషన్ పంపిణీ సవ్యంగా సాగడం లేదు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో సర్వర్ పనిచేయడం లేదనే కారణంతో కార్డుదారులను తిప్పించుకుంటున్నారు. దీనిపై లబ్ధిదారులు నిలదీస్తున్నా సర్వర్ పనిచేయకపోతే ఏం చేయాలని డీలర్ చెబుతున్నాడు. సాంకేతిక సమస్య కారణంగా అన్ని దుకాణాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఒక్కో లబ్ధిదారుడి వివరాలు నమోదు చేసేందుకు తీవ్ర ఆలస్యమవుతుండడంతో కార్డు దారులు క్యూ లైన్లలో వేచి ఉండకతప్పలేదు.

మండుటెండల్లో విలవిల

రేషన్ డిపోల్లో సరకులు పంపిణీ ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ, సరైన సౌకర్యాలు లేకపోవడంతో సరకులు తీసుకునేందుకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మనుమడు తోడుగా రేషన్ డిపోకు వస్తున్న తలుపులమ్మ

బుచ్చిరాజుపాలెం డిపో వద్ద కార్డుదారులు ఎండలోనే గంటల తరబడి వేచి ఉన్నారు. బియ్యం తీసుకొని మండుటెండలో తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు వృద్ధులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

కందిపప్పు ఏదీ?

రేషన్ డిపోలకు కందిపప్పు సరఫరా లేదు. ఒక్కోడిపోకు 50 కేజీల చొప్పున కందిపప్పు సరఫరా చేయగా, వాటిని తొలిరోజునే పంపిణీ చేశారు. దీంతో ప్రస్తుతం బియ్యం, పంచదార అందజేస్తున్నారు. కందిపప్పు కావాలని అడిగినా సరఫరా లేనందున తామేమీ చేయలేమని డీలర్లు చెబుతున్నారు.



మర్రిపాలెం వుడా లే అవుట్ రేషన్ డిపోలో సర్వర్ కష్టాలతో...

అంగన్‌వాడీలకు ఇబ్బందులు: అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన బియ్యం, కందిపప్పు, నూనె, పంచదార వంటి సరకులను ఎండీయూ వాహనాల ద్వారా నేరుగా కేంద్రాలకు సరఫరా చేసేవారు. కానీ, ఇప్పుడు డిపోల వద్దకు వచ్చి తీసుకెళ్లాలని చెబుతుండటంతో అంగన్‌వాడీ టీచర్లు వాటి కోసం కేంద్రాలను వదిలేసి రావాల్సి వస్తోంది.

‘వెన్నుపోటు దినం’ నిరసనకు తరలిరండి



పోస్టర్ విడుదల చేస్తున్న ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్

మల్కాపురం: కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటికీ వారు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సిగ్గుచేటని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. కూటమి నాయకులు హామీలు ఇచ్చి విస్మరించడంతో దీనికి నిరసనగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ‘వెన్నుపోటు దినం’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. హెచ్‌పీసీఎల్ ఐవోసీ గేటు వద్ద కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నిరసన

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడంతో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో జింక్ గేటు నుంచి ములగాడ తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం ఉదయం 9 గంటలకు నిరసన ర్యాలీ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ పరిధిలోని వార్డుల కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు, బూత్ కన్వీనర్లు పెద్ద ఎత్తున పాల్గొనున్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

సింధియా: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు చెక్ చెప్పవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి తెలిపారు. మునగాకు, ఆకుకూరలు, చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. మహిళల్లో వచ్చే రక్తహీనతపై 62వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్స్ జ్యోతిశ్రీ , అనుశ్రావణి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

మహిళల్లో వచ్చే రక్తహీనత, దాని లక్షణాలు, వ్యాధిని ఏ విధంగా అరికట్టాలి అనే అంశాలతో పాటు పౌష్టికాహారంపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. మల్కాపురంలో తల్లులందరూ ఐరన్‌రిచ్ ఫుడ్ ఎగ్జిబిషన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాగిపిండితో చేసిన వెరైటీలు, ఇతర పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పద్మకుమారి, అర్చన, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ప్రజలందరి భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. గురువారం ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితంగా మన జీవన విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా మారే బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తద్వారా పాఠశాల స్థాయి నుంచే చిన్నారులలో పర్యావరణ స్పృహను పెంపొందించి, సంరక్షించే బాధ్యతను వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ద్వారా మాత్రమే మానవ మనుగడ సాధ్యపడుతుందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకొని తదనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. విద్యా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షించడం, భవిష్యత్ తరాలకు అందించడం మనందరి బాధ్యత అని చెప్పారు. ముఖ్యంగా ఉపాధ్యాయులుగా మారే విద్యార్థులకు ఈ దిశగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విభాగాచార్యులు ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ ప్రవీణా దేవి, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి పైప్‌లైన్ లీకేజీ



తాటిపూడి పైప్‌లైన్ లీకవుతోంది ఇక్కడి నుంచే..



భారీగా వృథా పోతున్న నీరు

గోపాలపట్నం: తాటిపూడి పైప్‌లైన్ లీకేజీతో గోపాలపట్నం పార్కింగ్ ప్రాంత మంతా బురదమయంగా తయారయింది. రైతు బజారులో సమీపంలో తాటిపూడి పైప్‌లైన్ లీక్ అవుతోంది. నాలుగైదు రోజులుగా మంచినీరు వృథా అవుతుందని స్థానికులు చెబుతున్నారు. తొలుత వర్షం నీరు ఊటలా వస్తుందని అంతా భావించారు. ఆ తర్వాత నీరు ఎక్కువగా వస్తుండడంతో తాటిపూడి పైప్‌లైన్ లీకేజీ వల్లేనని గుర్తించినట్లు రైతు బజారు అధికారులు చెబుతున్నారు. దీనిపై తాటిపూడి పైప్‌లైన్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యాధికారి వెంకటరావు

మల్కాపురం: పుస్తక పఠనం వల్ల విషయ పరిజ్ఞానం పెరగడమే కాకుండ,విశ్లేషణా శక్తి, విమర్శనా శక్తి,సమస్యపరిష్కార శక్తి కూడా అభివృద్ధి చెందుతాయని ములగాడ మండల విద్యాధికారి వెంకటరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పుస్తకాలు ఎక్కువగా చదవడం వల్ల నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చెప్పారు. చిన్న వయసులో చదివిన విషయాలు ఎప్పటికీ మర్చిపోమని,అందుకే చిన్న వయసులోనే ఎక్కువ పుస్తకాలు చదవాలని సూచించారు. పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు తుంపాల శ్రీరామూర్తి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు.తల్లిదండ్రులను,పెద్దలను గౌరవించడం,వార్తా పత్రికలను నిరంతరం చదవడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు చిత్రలేఖనం,నీతి కథల బోధన చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఈ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,గ్రంథాలయాధికారి అజేయ్ కుమార్ పాల్గొన్నారు.

త్రినాథపురానికి తీరిన మంచినీటి సమస్య



పైపులైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురం వాసుల మంచినీటి కష్టాలు తీరాయి. పైపులైన్లు పూర్తి పగిలిపోయి ఎక్కడిక్కడ లీకులు అవడంతో కొద్ది రోజులుగా గ్రామంలో మంచి నీటిఎద్దడి నెలకొంది. సమస్యను గ్రామ ప్రజలు వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో జీవీఎంసీ మంచినీటి విభాగం సిబ్బంది మంగళవారం మరమ్మతులు పూర్తి చేశారు. గ్రామంలో మంచినీటి సమస్య తీరినందుకు ప్రజలు కార్పొరేటర్ లక్ష్మణరావుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్, నాయకులు సింగవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం–ఆయిల్ ట్యాంకర్ ఢీ

హైవేపై స్తంభించిన ట్రాఫిక్



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం



గాజువాక వైపు నిలిచిన వాహనాలు

విశాఖ విద్య: జాతీయ రహదారిపై ఎన్ఏడీ నుంచి గాజువాక వెళ్లే దారిలో కాకానినగర్ వద్ద మంగళవారం తెల్లవారుజామున రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనతో ట్రాఫిక్ స్తంభించింది. గాజువాక వైపు నుంచి వస్తున్న డీసీఎం వాహనం ముందు వెళ్తున్న ఆయిల్‌ట్యాంకర్‌ను ఢీ కొట్టింది. డీసీఎం వ్యాన్ ముందు భాగం దెబ్బతింది. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. అయితే, రెండు వాహనాలు రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో జాతీయ రహదారిపై అటు గాజువాక, ఇటు ఎన్ఏడీ వైపు వాహనాలు నిలిచిపోయాయి. గాజువాక నుంచి నగరంలోకి వచ్చే వాహనాలన్నీ తెల్లవారు జామున సుమారు గంటకు పైగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పొక్లెయినర్‌ను రప్పించి మధ్యలో నిలిచిన వాహనాలను పక్కకు తీయించారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి. అయితే ఫ్లైఓవర్ వద్ద గాజువాక వైపు వెళ్లే దారిలో జరుగుతున్న ఆర్‌వోబీ పనుల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆర్‌వోబీ నిర్మాణం కోసం రోడ్డు మధ్యలోనే సామగ్రి పెట్టడం , అదేవిధంగా వాహనాలను నిలుపుతుండడంతోనే తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు అంటున్నారు.

కాస్త పట్టించుకోండి..!



రోడ్డుపై పేర్చిన ఇటుక



రోడ్డుపై నిల్వ చేసిన ఇసుక

విశాఖ విద్య: జాతీయ రహదారి సమీపంలోని ఎన్ఎస్‌టీఎల్ పక్క నుంచి సింహాచలం వెళ్లే దారి ఆక్రమణలకు గురవుతోంది. జీవీఎంసీ 90వ వార్డులోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం ఎదురుగా బహుళ అంతస్తుల భవన నిర్మాణం జరుగుతోంది. దీనికి సంబంధించిన నిర్మాణ సామగ్రి అంతా రోడ్డుపైనే కుప్పలు వేసి, రోజుల తరబడి అలానే వదిలేస్తున్నారు. ఈ రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇలాంటి దారిలో నిర్మాణ సామగ్రి నిల్వ చేయడంతో తీవ్ర అసౌక్యంగా ఉంటుందని వాహనదారులు అంటున్నారు. ఏదైనా శుభకార్యాలు, ఇతర అత్యవసరాల కోసం రోడ్డును వినియోగించుకుంటే అక్కడికి వాలిపోయి నానా హడావుడి చేసే జీవీఎంసీ సిబ్బందికి ఇలాంటివి కనిపించడం లేదా అంటూ ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు. జీవీఎంసీ ఉన్నాధికారులు ఓ సారి ఇటు వైపు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో ప్రజలపై రూ. 112 కోట్ల అదనపు భారం

దాబాగార్డెన్స్: ‘భవన నిర్మాణాల విస్తీర్ణ కొలతలను తక్కువగా చూపుతున్నారనే సాకుతో కూటమి ప్రభుత్వం నివాస, వాణిజ్య భవనాల రీసర్వేను చేపడుతోంది. ఈ సర్వే ద్వారా ఆస్తి పన్నును కనీసం 20 శాతం పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రీసర్వేను తక్షణమే నిలిపివేయాలి అని కోరుతూ జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి. గంగారావు మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు.

‘ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయం అప్రజాస్వామికం. జీవీఎంసీ కౌన్సిల్ అభిప్రాయం తీసుకోకుండానే ఈ నిర్ణయం తీసుకోవడం చట్ట విరుద్ధం. ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం–1955లోని సెక్షన్ 220ఏ (1) ప్రకారం ఆస్తి పన్ను పెంపుపై నిర్ణయం తీసుకునే అధికారం జీవీఎంసీ కౌన్సిల్‌కు మాత్రమే ఉంది. ఈ సర్వే ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ. 463 కోట్లు, జీవీఎంసీలో రూ. 112 కోట్లు అదనంగా వసూలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది తగదని ఆయన తెలిపారు. విశాఖపట్నం పౌరుల ప్రయోజనాలను కాపాడే బాధ్యత జీవీఎంసీ కౌన్సిల్‌పై ఉంది అని గంగారావు వినతిపత్రంలో పేర్కొన్నారు.

పట్టపగలే వెలుగులు



మల్కాపురం సేవా మార్గంలో పగలు వెలుగుతున్న విద్యుత్ షో ల్యాంప్



కోస్టుగార్డు సేవా మార్గంలో వెలుగులు ఇస్తున్న లైట్లు

ఫోకస్

ప్రధాన సేవా మార్గంలో డివైడర్ మధ్య వేసిన విద్యుత్ షో ల్యాంప్స్ నిరంతరం కాంతులీనుతున్నాయి. రాత్రి సమయాల్లో వెలగాల్సిన వీధిదీపాలు పగలు కూడా ఆరడం లేదు. వీటిని పగటపూట వెలగకుండా జీవీఎంసీ సిబ్బంది నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలి. కానీ వారు నిర్లక్ష్యంగా ఉండడంతో వారం రోజుల నుంచి మల్కాపురం సేవామార్గంతో పాటు కోస్టుగార్డు ప్రాంతంలో విద్యుత్ షో ల్యాంప్స్ పగటి పూట కూడా వెలుగులు పంచుతున్నాయి.

– మల్కాపురం

TSR & TBK
DEGREE & P.G. COLLEGE
(AFFILIATED TO ANDHRA UNIVERSITY) D.No.27-1-235/1, SRINAGAR, GAJUWAKA, VISAKHAPATNAM

4 YEARS U.G. Courses

B.Sc (Honours)
- B.Sc. Animation
- B.Sc. Artificial Intelligence & Robotics
- B.Sc. Data Science
- B.Sc. Computer Science
- B.Sc. Mathematics
- B.Sc. Physics
- B.Sc. Chemistry
- B.Sc. Zoology
- B.Sc. Bioinformatics
- B.Sc. Bio-Technology
- B.Sc. Microbiology

B.C.A. (Honours)

B.B.A. (Honours) • General
- Digital Marketing
- Business Analytics

B.Com (Honours)
- Computer Applications

P.G. Courses

M.Sc • M.Sc. Microbiology
- M.Sc. Analytical Chemistry
- M.Sc. Organic Chemistry
- M.Sc. Zoology
- Established advanced computer labs in Vizag city for Artifical Intelligence, Robotics (Machine Learning), and Data Science.
- Facilitated Campus Placement Drives in collaboration with top MNC's.

ADMISSIONS OPEN 2025-26

0891 2759920, 9346434347, 6281986412, 9985302755

Website: www.tsrtbkcollege.com E-mail: principal.tsrtbk@gmail.com